www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 మే 2024 8 పేజీలు
తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ






ఇక ఓటరు వంతు

- నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలు
- పోలీసుల పటిష్ట బందోబస్తు



సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. పోలింగ్ నిర్వహణకు కావాల్సిన సామగ్రితో పోలింగ్ సిబ్బంది పయనమయ్యారు. బస్సులు, లాంచీలు, ఇతర వాహనాలపై కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు.

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ఘట్టంలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాలకు 36 మంది, 21 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు 254 మంది అభ్యర్థులు బరిలో నిలుచున్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవలే ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 47,88,681 మంది ఓటర్లు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 16,34,122 మంది, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 15,31,410 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 16,23,149 మంది ఉన్నారు. మూడు జిల్లాల్లో మొత్తం 4,858 బూత్‌లు ఏర్పాటు చేసారు. కాకినాడ జిల్లాలో 1,637, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,644, తూర్పు గోదావరి జిల్లాలో 1,577 ఉన్నాయి. మొత్తం 1261 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించిన అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 331, కోనసీమ జిల్లాలో 563, తూర్పు గోదావరి జిల్లాలో 367 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు పిఒలు, ఎపిఒలు ఇతర సిబ్బంది మూడు జిల్లాల్లో 33,279 మంది పని చేయనున్నారు. సుమారు 5 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 1296 మంది మైక్రో అబ్జర్వర్లు నియమితులయ్యారు.

కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ టీములు

మూడు జిల్లాల్లో ఉన్న 21 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించడానికి ఆదివారం సాయంత్రానికే పోలింగ్

2లో..

ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ బరిలో 290 మంది
ఓటు హక్కు వినియోగించుకొనున్న 47,88,681 మంది
4858 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు,
1261 సమస్యాత్మక కేంద్రాలు
ఎన్నికల విధుల్లో 33,279 మంది సిబ్బంది


హోప్ ఐలాండ్‌కు ఎన్నికల సామగ్రిని పడవల ద్వారా తరలిస్తున్న సిబ్బంది


కొత్తపేటలో వర్షపు నీటిలో ఎన్నికల సిబ్బంది

అకాల వర్షంతో అవస్థలు

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ సిబ్బంది కొత్తపేట హైస్కూల్ గ్రౌండ్ వద్ద ఇవిఎం తదితర పరికరాలను అధికారులు అందజేశారు. హఠాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు సిబ్బంది ఉండటానికి వేసిన టెంట్లు కూలిపోయాయి. తమకు ఇచ్చిన సామగ్రిని తీసుకు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. వర్షం దాటికి మోకాళ్ళ లోతు నీరు బురద గ్రౌండ్‌లోకి చేరడంతో ఇచ్చిన సామగ్రితో బయటపడడానికి అవస్థలు పడ్డారు. గ్రౌండ్‌లో సిబ్బంది ఎక్కిన బస్సులు ముందుకు కదలక మొరాయించాయి. దీంతో జెసిబిల సాయంతో వాటిని ముందుకు కదిలించారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందుగానే ప్రకటించినా తగిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఎన్నికల సామగ్రితో సిబ్బంది

కార్టూ'నిజం'



తాగునీటి సమస్యపై ఎన్నికల బహిష్కరణ

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు తాగునీరు ఇవ్వడంలో అలసత్వం వహిస్తుందడటం వల్ల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులపల్లి శివారు ఉప్పరగూడెం గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామంలో ఒక్క మంచినీటి బావి కూడా లేదన్నారు. పక్కనున్న కాలువలో కూడా మురికి నీరు తప్ప కనీసం వాడుకునే నీరు కూడా లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. చాలాకాలంగా ట్యాంకుకు ఎక్కే మంచినీటి పైప్ లైన్లు ఎక్కడికక్కడ లీకులవుతున్నాయని అధికారులు దృష్టికి తీసుకు వెళ్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందువల్లనే ట్యాంకుకు నీరు ఎక్కడం లేదన్నారు. ఎన్నికల పోలింగ్ సిబ్బందికి కూడా కనీసం కాల కృత్యాలు తీర్చుకోడానికి కూడా నీరు లేకపోవడంతో అక్కడి ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సిబ్బంది బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఒక్క రోజుకే ఎన్నికల సిబ్బంది మంచినీటి ఏర్పాట్ల కోసం నరకం చూస్తుంటే ప్రతిరోజూ ఆ గ్రామంలో ఉన్న ప్రజలు ఎంత నరకం అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. సంబంధిత మండల అధికారికి ఫోన్ చేసినా రెస్పాండ్ కాక పోవడంతోనే ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు నాగులపల్లి వైస్ సర్పంచ్ చిరంజీవి, గ్రామస్తులు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని, లేకపోతే సుమారు 600 ఓట్లు తమ గ్రామంలో ఉన్నాయని వాటిని బహిష్కరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామానికి మంచినీరు ఇవ్వడంలో అలసత్వం వస్తున్న అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకుని గ్రామానికి మంచినీరు అవసరమైనంత వరకు అందిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని గ్రామస్తులు తేల్చి చెప్పారు.


ఆటోలో తాగునీరు తెస్తున్న యువకుడు

పోలింగ్ సిరాపై తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ

పోలింగ్ తరువాత వేసే చెరగని సిరాపై సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని, మరెవరికీ ఇది అందుబాటులో ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సిరా భారతీయ ఎన్నికల సంఘం వద్ద కాక ఇతరులు ఎవరికైనా అందుబాటులో ఉంటుందనేది తప్పుడు ప్రచారం అన్నారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కనకమహాలక్ష్మి జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ సోమవారం నుండి శుక్రవారం వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ధర్మకర్తల మండలి ఛైర్మన్ తులా నాగరాజు ఆదివారం తెలిపారు సోమవారం రాత్రి అమ్మవారి జాతర, మంగళవారం నైవేద్యాలు, బుధవారం అమ్మవారి తీర్థము నిర్వహిస్తారన్నారు. 17వ తేదీ శుక్రవారం అన్న సమారాధనతో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు ఆలయము వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-చాగల్లు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చాగల్లు మండలంలో నేడు(సోమవారం) నిర్వహించనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. మండలంలో 50 పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఓటర్స్ జనాభా 52441 పురుషులు 25 675 స్త్రీలు 26766 ఓటరు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఇంటర్ జూనియర్ మహిళ కళాశాల చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన కళాశాల్లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

నిడదవోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

నిడదవోలు నియోజకవర్గం మొత్తం ఓటర్ల లో అధిక భాగం మహిళలదే. మొత్తం ఓటర్ల సంఖ్య 2, 13, 392 కాగా మండలాల వారీగా నిడదవోలు పురుషులు 45306, మహిళలు 48020, థర్డ్ జెండర్ 2, ఉండ్రాజవరం లో పురుషులు 30366, మహిళలు 31995, థర్డ్ జెండర్ 1, పెరవలి పురుషులు 28563, మహిళలు 29142, ట్రాన్స్ జెండర్1, మొత్తం ట్రాన్స్ జెండర్ ల సంఖ్య 4. ఇక 18 ప్లస్ ఓటర్ల సంఖ్య నిడదవోలు పురుషులు 1441, మహిళలు 1281, ఉండ్రాజవరం పురుషులు 988, మహిళలు 898, పెరవలి పురుషులు 898, మహిళలు 889 మొత్తం 6395 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో 4922 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 18 ప్లస్ లో259 మంది పురుషులే అధికంగా ఉన్నారు. నిడదవోలు 1-91, ఉండ్రాజవరం 92-149, పెరవలి 150-205 వరకు పోలింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఓటింగ్ సరళి జరిగితే అభ్యర్థుల గెలుపు లో మహిళలే పై చేయి అవుతారు.

నేడు ఓటు వియోగించుకోనున్న 2,16,491 మంది ఓటర్లు

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో 2,16,491 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీనిలో పురుషులు 1,06,897, మహిళలు 1,09,606 ఉన్నారు. వీరికోసం 216 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. దీనిలో సమాస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 50, అత్యంత సమాస్యంతక పోలింగ్ కేంద్రాలు 27, దీనికి సెక్టార్ ఆఫీసర్స్ 20, రూట్ ఆఫీసర్లు 20, ఎంసిసి టీమ్లు 3, పిఎస్టిటి టీమ్ 9, వీడియో సర్వీసింగ్ టీమ్ 4, వీడియో వీయూ టీమ్ 4, అకౌంటింగ్ టీమ్ 2, పిఒలు 235, ఎపిఒలు 228, ఒపిఒలు 707, మైక్రో అబ్జర్వర్లు 55, వెబ్ కాస్టింట్ 216 మంది ఏర్పాటు చేశారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటి కొండ గ్రామం పలువురు వైసిపిలో చేరారు. వీరికి తంటికొండ దేవస్థానం ఛైర్మన్ బదిరెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైసిపి కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి తోట నరసింహంను గెలుపించుకోవడానికి ఆదివారం తంటికొండ గ్రామం లో ఉన్న కంచర్ల చక్రధర్, నూకా సూర్యప్రకాశ్ రావు, నాగులకొండ రామలింగేశ్వరరావు, కలిగిన నరసింహం వైసిపి తరపున మద్దతు పలుకుతూ పార్టీలోకి చేరారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులుపాల్గొన్నారు.

ద్రాక్షారామంలో డంపింగ్ యార్డ్ సమస్య

30 ఏళ్లుగా తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పంచారామాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ద్రాక్షారామంలో డంపింగ్ యార్డ్ లేక చెత్త సమస్య నేటికీ పరిష్కారం కాక ప్రజలు పరిసర ప్రాంతాలవాసులు ఇక్కట్లకు గురవుతున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్ర నలుమూలల నుంచి త్రిలింగ క్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి ఆలయానికి నిత్యం వందలాదిమంది యాత్రికులు వస్తుంటారు, పర్వదినాల్లోనూ కార్తీకమాసంలోనూ వేలాదిమంది యాత్రికులు ఇక్కడకు రావడంతో నిత్యం రద్దీగా ఉండే భీమేశ్వర స్వామి ఆలయం వెనక ద్రాక్షారామం పంచాయతీ డంపింగ్ యార్డ్ కు ఉపయోగిస్తుంది. ఇక్కడ శ్మశానాన్నిన అనుకున్న స్థలంలో డంపింగ్ యార్డ్ కు వాడటంతో ఆలయం నుంచి వచ్చే వ్యర్థాలు, అన్ని వార్డులను సేకరించిన చెత్తాచెదారం, ద్రాక్షారామం కూరగాయల మార్కెట్, చాపల మార్కెట్ నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడ డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నారు. దీంతో నిత్యం దుర్వాసన అటు వెళ్లాలంటే యాత్రికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ డంపింగ్ యార్డ్ ను తొలగించాలని ప్రజలు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్న అది నేటికీ సాధ్యం కాలేదు. ఇక వర్షం వస్తే ఇక్కడ పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. పెరిగిపోయిన చెత్తలో పందులు స్వైర విహారం చేస్తూ తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు పలు అనారోగ్య సమస్యలకు జనం గురయ్యే ప్రమాదం ఉంది.



ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయం వెనక పేరుకుపోయిన చెత్త

కలెక్టర్ దత్తత తీసుకున్న గ్రామంలో తొలగని చెత్త సమస్య

ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ద్రాక్షారామను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దత్తత తీసుకునీ రెండేళ్లు కావస్తోంది అయితే ఇప్పటికే చెత్త సమస్య డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కాలేదు. దీని తోడు ద్రాక్షారామకు వచ్చే పంట కాలవను, డ్రయినేజీలను వ్యాపారస్తులు ఇష్టాను రీతిగా ఆక్రమించారు. దీంతో డ్రయినేజీలో పేరుకుపోయిన చెత్త చెదారంతో వంటకాలు వచ్చే నీటికి రైతులు ఇక్కట్లకు గురికావాల్సి వస్తోంది. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు అంతగా దష్టి సారించకపోవడంతో గత 30 ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకుండా నిలిచిపోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై దష్టి సారించి స్వామివారి గుడి వెనక గల డంపింగ్ యార్డ్ ను వేరే చోటకి తరలించాలని ఈ రోడ్డుపై ఎటువంటి చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, ఆక్రమణ లు తొలగించాలని ద్రాక్షారామ గ్రామస్తులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఆదివారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. వైద్య రంగంలో కీలకమైన నర్సుల గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తారు. పలువురు వక్తలు మాట్లాడుతూ 1859 లో నోట్స్ ఆన్ నర్సింగ్ అనే పుస్తకాన్ని రచించిన నైటింగేల్ ప్రపంచంలోనే మొట్టమొదటి నర్సింగ్ శిక్షణ సంస్థను స్థాపించారన్నారు. ఆమె సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సింగ్ సంస్థ ప్రతి ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకుం టున్నారని అన్నారు. రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు ప్రతి రోజూ వందలాది మంది రోగులకు సేవలు అందిస్తున్న నర్సులకు ఈ సమాజం రుణపడి ఉంటుందని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి తెలిపారు. తమ కుటుంబాలను వదిలి తమ జీవితాలను ఫణంగా పెట్టి కరోనా వైరస్ సమయంలో వందలాది మంది రోగులను రక్షించి ప్రాణాలు నిలబెట్టిన నర్సుల సేవలను మరువలేమన్నారు. గర్భిణులకు, ప్రమాదాల బారిన పడినవారికి, రోగులకు వైద్య చికిత్స అందించే సమయంలో ఎంతో సహనంగా సేవలందిస్తున్న నర్సుల త్యాగం మరువలేనిదని అన్నారు. సమాజ హితం కోసం పనిచేస్తున్న నర్సులు అందరికీ ప్రజలందరి తరపున తొగరు మూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నర్సులు, వైద్యసిబ్బంది

ఇక ఓటరు వంతు...

(మొదటి పేజీ తరువాయి)

టీములు ఆయా కేంద్రాలకు చేరుకున్నాయి. జిల్లాలోని 21 నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, సిబ్బంది ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాల్లో చేరుకున్నారు. సిబ్బంది ఇవిఎంల తరలింపు కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం హోప్ ఐలాండ్‌ఉ ఎన్నికల సామాగ్రిని మర పడవల ద్వారా ఎన్నికల సిబ్బంది తీసుకెళ్లారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్లు

కాకినాడ, రాజమండ్రి, అమలాపురం కలెక్టరేట్లలోని కంట్రోల్ రూమ్స్‌లో నియోజకవర్గాల వారీగా ఇవిఎంలు, సిబ్బంది రవాణాను వెబ్ కాస్టింగ్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు కేంద్రాన్ని వెబ్ కాస్టింగ్ కోసం అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం నుంచి ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలింపు మొదలైందని మధ్యాహ్నం సమయానికి, కొన్నిచోట్ల సాయంత్రానికి సిబ్బంది అన్ని కేంద్రాలకూ చేరుకున్నారని తెలిపారు. సిబ్బందికి ఆహారం, తాగునీరు పంపిణీ ఏర్పాట్లు కూడా చేశామన్నారు. జిల్లాల్లో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తోపాటు మైక్రో అబ్జర్వర్లు కూడా నియమించామన్నారు. ఇవిఎంలు, వివిపాట్‌ల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక సమస్య పరిష్కరించడం కోసం బెల్ ఇంజనీర్ల సేవలు వినియోగిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ముగ్గురు ఇంజనీర్లు అందుబాటులో ఉంటారన్నారు.

ఐదున్నర గంటలకే మాక్ పోలింగ్

ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఐదున్నర గంటలకే పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మాక్ పోల్ నిర్వహించడం, వాటిని క్లియర్ చేసి పోలింగ్ నిర్వహించవలసి ఉన్నందున 5.30 గంటల సమయం నిర్ణయించామన్నారు.

వెంకన్నను దర్శించుకున్న హోమ్ మంత్రి వనిత

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని ఆదివారం ఎపి హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత దర్శించుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా మంత్రికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం మంత్రికి వాడపల్లి వెంకన్న చిత్రపటం తో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎన్నికల నియమావళి ప్రవర్తన అమలులో ఉన్న ఈమెకు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించడంపై ఆలయ అధికారులపై మరియు సిబ్బందిపై పలువురు మండిపడుతున్నారు

మజ్జిగ పంపిణీ చేసిన దాతలు

ప్రజాశక్తి-చాగల్లు

స్థానిక మెయిన్ రోడ్డు బస్టాండ్ సెంటర్ వద్ద మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 41వ రోజు ఆదివారం దాతలు జుట్టా వీరరాఘవులు (21వ వర్ధంతి) సందర్భముగా వారి కుమారులు మరియు కుటుంబసభ్యులు సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీకాకతీయ కళ్యాణమండపం సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద దాతలు సీతారామాంజనేయులు భార్య ఆళ్ళ సత్యవతి పెద్దకర్మ సందర్భముగా వారి కుమారుడు, వారి సహకారంతో మజ్జిగపంపిణీ చేశారు. దాతలను సేవా సంస్థ సభ్యులు కొట్టూరు శ్రీనివాస్, జుజ్జువరపు వెంకట కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు

తాగునీటికి కటకట..!

-పదేళ్లుగా ప్రజలకు తప్పని ఇక్కట్లు
-ఎన్నికల ప్రభావం తప్పదా..?

ప్రజాశక్తి - కరప

సంవత్సరాలు గడుస్తున్న ఏ ప్రభుత్వం వచ్చినా సమస్య పరిష్కారం కాదు. సామూహిక రక్షిత మంచినీటి ప్రాజెక్టులు కోట్ల రూపాయలతో నిర్మించి ఉన్న ఎండ మావులుగా మిగులుతున్నాయి. ప్రాజెక్టుల్లో పెరుగుతున్న చేపలను అమ్ముకుని సొమ్ములు చేసుకునేందుకు చేస్తున్న చొరవ నీటి సరఫరా సక్రమంగా చేసేందుకు నాయకులకు మనసు రావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కరప మండల ప్రజలు తాగునీరు కోసం కటకట లాడుతున్నారు. కరప మండలంలోని 23 గ్రామాలు ఉండగా 33 వాటర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. 2 సామూహిక రక్షిత మంచినీట ప్రాజెక్టులు కరప, వేళంగిలో ఉన్నాయి. కరప ప్రాజెక్టు ద్వారా 8 గ్రామాలకు, వేళంగి ప్రాజెక్టు ద్వారా 12 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. చెప్పుకోవడానికి తప్ప వీటి ద్వారా తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదు. సరఫరా జరిగిన కొద్దిపాటి సమయము మాత్రమే ఇవ్వటం జరుగుతుంది. సరఫరా అయిన నీరు నీచు వాసనతో తాగేందుకు పనికిరాకుండా వాడకపు నీరుగా మిగులుతుంది. వాటర్ హెడ్ ట్యాంకులు మాత్రం హడావిడిగా ఏ ప్రభుత్వంలో నైనా నిర్మించడం జరుగుతుంది. వాటర్ హెడ్ ట్యాంకులు నిర్మాణాలు రంగులు వేసుకోవడానికి తప్ప దాని ద్వారా రక్షిత తాగునీరు సరఫరా సక్రమంగా జరగటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోని ఇదే పరిస్థితి నెలకొంది.


రాత్రి సమయంలో తాగునీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు


కరప సామూహిక రక్షిత తాగునీటి ప్రాజెక్ట్

ప్రధానంగా మండల కేంద్రమైన కరప గ్రామంలోని సామూహిక రక్షిత తాగునీరు ప్రాజెక్ట్ రూ.20 కోట్లతో నిర్మించారు. ఇది వినియోగంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తవుతున్న ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా సాగడం లేదు. కరప గ్రామ ప్రజలు ఆర్ఓ ప్లాంట్లపై ఆధారపడి డబ్బులకు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఉంది. కొందరు ఆర్ఓ ప్లాంట్ నీటిని వినియోగించలేక పెనుగుదురు నుంచి కరప వాటర్ హెడ్ ట్యాంకు సరఫరా అవుతున్న నీటి కోసం ఊరి శివారుకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తాగునీటి కష్టాలు ప్రభావం చూపే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

ప్రజాశక్తి - సామర్లకోట


ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఓ సీతారామారావు

పెద్దాపురం నియోజక వర్గానికి సంబంధించి 201 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. పోలింగ్ అధికారులు పోలింగ్ సామాగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి నియోజక వర్గ కేంద్రం అయిన పెద్దాపురం మాహారాణి కళాశాల ఆవరణ నుంచి పోలింగ్ సిబ్బందికి సామాగ్రితో బయలు దేరి ప్రత్యేక బస్సుల్లో సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు అధికారులు ప్రత్యేక భద్రత నడుమ తరలించారు. ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక పిఒ, ఒక ఎపిఒతోపాటు మరో నలుగురు ఒపిఒలను ఎన్నిక విధులకు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్ సదుపాయం, సిసి కెమెరాల ఏర్పాటు ఇతర సదుపాయాలను స్థానిక అధికారులు సిద్ధం చేశారు. అధికారులు అందించిన ఇవిఎం లు, వివిప్యాట్స్ తదితర పోలింగ్ సామగ్రితో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పిఎస్ లకు చేరుకుని వారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్ఓ సీతారామారావు చెప్పారు. 201 పిఎస్‌లకు సంభందించి 1250 మందిని పోలింగ్ విధులకు కేటాయించగా మరో 150 మందిని రిజర్వులో అందుబాటులో ఉంచామన్నారు. నియోజక వర్గంలో 22 మంది రూటు అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంకా నియోజక వర్గ పరిధిలో 48 సమస్యత్మాక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుండగా వాటివద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా నియోజక వర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లో ప్రత్యేక భద్రతా వలయాలు విధులు నిర్వర్తిస్తున్నట్టు ఆయన తెలిపారు.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు


క్షేత్రస్థాయి పర్యటనలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌పి జగదీష్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఏపి.జగదీష్ అన్నారు. ఆదివారం జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా వారికి సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అన్నారు. ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. రౌడీ షీటర్లు మరియు ఓల్డ్ ఎలక్షన్ అఫెండర్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అన్నారు.

హోప్ ఐల్యాండ్‌లో పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి - తాళ్లరేవు


హోప్ ఐల్యాండ్‌కు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

మండలంలోని కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్ ఐలాండ్ లో ఉన్న 315 మంది ఓటర్లకు అక్కడ పోలింగ్ నిర్వహించడానికి 10 మంది సిబ్బందిని తరలించినట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడకు సమీపంలో సముద్రంలో ఉన్న ఈ దీవిలో పోలింగ్ నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. సోమవారం పోలింగ్ అనంతరం ఇవిఎంలతో తిరిగి సిబ్బంది ముమ్మిడివరం చేరుకుంటారని ఆయన వివరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు

ప్రజాశక్తి - తాళ్లరేవు


సమస్యాత్మక గ్రామంలో పోలీసుల బందోబస్తు

మండలంలోని 6 సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గాడిమొగ, పెదవలసల, చినవలసల, పెదబొడ్డు వెంకటాయపాలెం, రామన్నపాలెం, లక్ష్మీపతిపురం గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. మండలంలో 49 ప్రాంతాల్లో గల 75 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు 80 మంది పోలీసులు బందోబస్తుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

క్రైం వార్తలు


బైక్‌ను ఢీకొట్టిన ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు

బస్సు ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల గ్రామ శివారున 16 నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆ బాలుడి బాబాయ్ సూర్యచంద్రరావు తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో ఓ శుభకార్యానికి వస్తున్న బంధువును ఇంటికి తీసుకెళ్లేందుకు ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన గొన్నూరి రాజు, మరియమ్మ ఏకైక కుమారుడు సిద్దు (3)ను తీసుకుని బాబాయ్ సూర్యచంద్రరావు నల్లజర్ల మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. వీరిని నల్లజర్ల శివారున వెనుక నుంచి ప్రయివేట్ ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. కొంత దూరం ఈడ్చికెళ్లిన క్రమంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యచంద్రరావు తలకు తీవ్రగాయం అయ్యింది. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలోని అంబేద్కర్ నగర్‌లో మూడంతస్తుల భవనంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. జగ్గంపేటకి చెందిన సిమెంట్ వ్యాపారి పులపర్తి సురేష్ భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ఈ ప్రమాదంలో ఫర్నిచర్ కాస్త పూర్తిగా దగ్ధమైంది. విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ మూడవ అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఫర్నిచర్ ధ్వంసమైందన్నారు. నష్టం రూ.5 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు. విషయం తెలుసుకున్న టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

12 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలం చిట్యాల గ్రామంలో దాడులు నిర్వహించి ఒక వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు, 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ కెవి.స్వామి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారిపై మోటార్ సైకిల్ అదుపుతప్పి హెచ్చరిక స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు.. రాజానగరం మండలం చక్రద్వారబంధం చెందిన రాయుడు వీరబాబు(17) మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తూ ఉండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను స్తంభాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి తెలిపారు


సిబ్బందికి సూచనలు ఇసున్న డిఎస్‌పి లతాకుమారి

18 సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెద్దాపురం నియోజకవర్గంలో 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు ఆర్‌ఒ సీతారామారావు, డిఎస్‌పి లతాకుమారి తెలిపారు. పెద్దాపురం అర్బన్, సామర్లకోట అర్బన్, పెద్దాపురం రూరల్ పరిధిలో కాండ్రకోట, కట్టమూరు, గుడివాడ, ఉలిమేశ్వరం, మర్లవ, తిరుపతి, తాడిపర్తి, దివిలి, పులిమేరు, చిన్న బ్రహ్మదేవం, సామర్లకోట మండలంలో వేట్లపాలెం, మేడ పాడు పెద్ద బ్రహ్మ దేవం, హుస్సేన్ పురం, వెంకటకృష్ణ రాయపురం, మాధవపట్నం, పి. వేమవరం గ్రామాలను గుర్తించి ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కాగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతివారు పూర్తి సహకారాన్ని అందించాలని వారు కోరారు.


యాత్రికులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రంను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది జి.క్రాంతివీర్, లోవరాజు పాల్గొన్నారు.


మాతృమూర్తులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ తల్లిని మించిన దైవం లేదని, నవమాసాలు మోసి జన్మనిచ్చిన దైవం అమ్మ అని అన్నారు. ఆమె త్యాగాలకు విలువ కట్టలేమని అన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ పోషణ, ఉజ్వల భవిష్యత్తు కోసం జీవితాంతం పరితపించే తల్లిని మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ అమ్మ రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అడబాల సమకూర్చిన నూతన వస్త్రాలను పిల్లలచే తల్లులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొండా సూర్యారావు, డాక్టర్ వెంకటరమణ, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు పూర్ణ పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - కాజులూరు

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని గొల్లపాలెం ఎస్‌ఐ ఎస్.తులసిరామ్ తెలిపారు. ఆదివారం గొల్లపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి మండలంలో 70పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు, కేంద్ర బలగాలు అదనంగా ఉన్నాయన్నారు. సమస్యాత్మక, ఆతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెఇపారు.

ఓటుకు నోటు కోసం రోడ్డెక్కిన ఓటర్లు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


కొండవరంలో ధర్నా నిర్వహిస్తున్న మహిళా ఓటర్లు

తమ గ్రామంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని రోడ్డెక్కి ఆందోళన చేయడం చూశాం. లేదంటే తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన వ్యక్తం చేయడమూ చూశాము. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు చేపట్టిన నగదు పంపిణీ తమకు అందలేదంటూ ఓటర్లు ఆందోళనకు దిగడం చర్చానీయాంశంగా మారింది. మండలంలోని కొండవరం గ్రామంలో ఆదివారం ఉదయం పిఠాపురం, ఉప్పాడ ప్రధాన రోడ్డుపై మహిళలు, యువకులు ధర్నా చేపట్టారు. అధికార వైసిపి ఒక్కో ఓటుకు రూ.3 వేలు చొప్పున పంపిణీ చేసిందని, అయితే తమకు అందలేదని, నగదు పంపిణీలో తమను పక్కన పెట్టడాన్ని నిరసిస్తూ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా పెద్దఎత్తున చర్యలు తీసుకున్నామని ఎన్నికల అధికారులు చేసిన ప్రకటన ఆచరణలో ఎక్కడా కన్పించిన దాఖలాలు లేకుండా పోయాయి. అధికార వైసిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకత్వం పోటాపోటీగా ఓటు కోసం నోట్ల కట్లను పంపిణీ చేశారు. యథేచ్ఛగా రాత్రి, పగలు అని తేడా లేకుండా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికార వైసిపి, జనసేన పార్టీల నాయకులు పనిచేశారు. అయితే ఓటుకు నోటును అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



పింక్ కలర్‌తో తీర్చిదిద్దిన పోలింగ్ బూత్

గంగనాపల్లిలో పింక్ కలర్ బూత్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం గంగనాపల్లి గ్రామంలో అత్యధిక మహిళ ఓటర్లు ఉండడంతో ఎన్నికల సంఘం పింక్ కలర్ బూత్ ఏర్పాటు చేశారు. గంగానాపల్లి గ్రామంలో 155 పోలింగ్ బూత్ లో మొత్తం 1424 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 706 , మహిళ ఓటరులు 718 మంది ఉన్నారు. పురుషులు కన్నా మహిళలు ఎక్కువగా ఉండటంతో అధికారులు పింక్ కలర్‌తో బూత్‌గా గుర్తించి ప్రత్యేకంగా అలంకరించారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

-బూత్‌లకు చేరుకున్న సిబ్బంది
-ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఇవే

ప్రజాశక్తి - పిఠాపురం


పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

సార్వత్రిక ఎన్నికలు 4వ దశ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఒ, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 132 లొకేషన్లలో 242 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుం దన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 2,36,409 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 1,18,183 మంది పురుషులు, 1,18,183 మంది మహిళలు, ఇతరులు 3 ఓట్లు ఉన్నాయని అన్నారు. ఎన్నికల విధులకు 308 మంది పిఒలు, 314 మంది ఎపిఒలు, 1188 మంది ఒపిఒలు, 22మంది సెక్టోరల్ అధికారులు, 80 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధులకు హాజరవ్వుతున్నారన్నారు. 227 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందని నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రలను 22 రూట్లుగా విభజించామన్నారు. 71 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు 300మంది పోలీస్, స్పెషల్ పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారని తెలిపారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గణేషన్ పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి అందించే భోజనాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందిని ప్రత్యేక బస్సులలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఇవే

నియోజకవర్గంలోని మూడు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక పోలింగ్ కేంద్రాలుగా ఎన్నికల అధికారులు తీర్చిదిద్దారు. స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 155వ పోలింగ్ స్టేషన్‌ను ఆదర్శ పోలింగ్ స్టేషన్‌గా, బాప్టిస్ట్ చర్చ్ మున్సిపల్ పాఠశాలలోని 157వ పోలింగ్ స్టేషన్ ను పింక్ పోలింగ్ స్టేషన్ (మహిళ ఓటర్లు అధికం)గా, ఉప్పాడ కొత్తపల్లి మండలంలోని కొనపాప పేటలోని 182వ పోలింగ్ స్టేషన్‌ను దివ్యాంగుల ప్రత్యేక పోలింగ్ స్టేషన్‌గా సిద్ధం చేశారు.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం


క్యూలైన్లలో యాత్రికులు

మండలంలోని కాండ్రకోట గ్రామంలో జరుగుతున్న నూకాలమ్మ జాతరకు ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు రావటంతో ఆలయ పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండకుండా వేగవంతంగా నూకాలమ్మను దర్శించుకునేలా, మొక్కుబడులు చెల్లించుకునేలా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లలో యాత్రికులకు మంచి నీటిని, మజ్జిగను అందజేశారు. ఎస్‌ఐ వి.సురేష్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందజేశారు.

ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి - సామర్లకోట



మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

పట్టణంలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్లోని 134 నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా అధికారులు సిద్ధం చేశారు. ఈ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్ రిబ్బను కత్తిరించి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. పండగను తలపించే విధంగా ఆకర్షనీయమైన ముఖ ద్వారం, మామిడి తోరణాలతో అలంకరించిన ద్వారాబంధాలు, ఓటర్లకు ఆహ్వానం తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఆకుపచ్చ తివాచీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ పోలింగ్ కేంద్రంలో 661 మంది పురుషులు, 695 మంది మహిళలు వెరసి మొత్తం 1,356 మంది ఓటర్లు వారి ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఓటర్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల ఆవరణలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 201పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జె సీతారామారావు మాట్లాడుతూ 201 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1382 మంది సిబ్బంది ఉన్నారన్నారు. 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో 46 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రశాంత వాతావరణంలో నియోజకవర్గ పరిధిలోని 2,15,095 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 22 మంది సెక్టార్ అధికారులు, 29 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తారన్నారు. పోలింగ్ సిబ్బంది 22 రూట్‌లు ద్వారా 50 వాహనాలలో పోలింగ్ సామగ్రితో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి లతా కుమారి పాల్గొన్నారు.


ఇవిఎంలతో బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది

ముగిసిన సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ ఎనర్జీ స్కూల్లో 15 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు క్రికెట్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, గుర్రపు స్వారీ, కర్రసాము, థియేటర్ ఆర్ట్స్, రోప్ స్కిప్పింగ్, రోబోటిక్స్, మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, యోగా, స్విమ్మింగ్, ఇంగ్లీష్, మ్యాథ్స్ తదితర అంశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ ముగింపు సభలో రాజేష్ కామిరెడ్డి పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

నేడు(సోమవారం) జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా తెలిపారు. ఆదివారం ఆయన మండపేట వేగుళ్ళ సూర్యారావు గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అసెంబ్లీ స్థాయిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ, పోలింగ్ సిబ్బంది హాజరు, తరలింపు ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోలింగ్ సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేసుకొని సామగ్రి అంతా స్వీక రించింది లేనిది ఒకటికి రెండుసార్లు పరిశీలిం చుకోవాలన్నారు. పిఒ డైరీ సీళ్ళు, సాధారణ కవర్లు చట్టబద్ధమైన కవర్లు ఇండెలిబుల్ ఇంకు తదితర సామగ్రిని సమగ్రంగా సిబ్బందితో పాటుగా తీసుకుని తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సూక్ష్మ పరిశీలకులతో సెక్టార్ ఆఫీసర్ మార్గ దర్శకత్వంలో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. స్థానికంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను సమగ్రంగా చేపడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం వాతావర ణంలో మార్పు వచ్చినందున సోమవారం పోలింగ్ రోజున కొద్దిపాటి వర్షం పడినా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రత తరలింపులో పాలిథిన్ కవర్లు వంటి భద్రత సామగ్రి తో పాటు అందుకు అవసరమైన ఇతర సిబ్బందిని నియ మించి సురక్షితంగా ఎలక్ట్రా నిక్ ఓటింగ్ యంత్రాలను రిసెప్షన్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు కూడా చేపట్టామన్నారు జిల్లా ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అనంతరం కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి వర్షం పడుతున్నందున వాతావరణ పరిస్థితులు


మండపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హిమాన్ను శుక్లా

అనుకూలంగా లేని దృష్ట్యా త్వరితగతిన పోలింగ్ సిబ్బందిని భద్రతా సిబ్బందిని కేటా యించిన పోలింగ్ కేంద్రా లకు వేగంగా తరలించాలని రిటర్నింగ్ అధికారులు ఆదేశించారు కార్యక్ర మంలో రిటర్నింగ్ అధికారులు డివిఎస్.ఎల్లారావు, జివివి.సత్యనారాయణ, సహాయ రిటర్నిం గ్ అధికారులు ఎం.సురేష్ కుమార్, జి.ఎలిషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

నేడు జరగనున్న పోలింగ్ సంబంధించి పోలింగ్ సామగ్రిని ఆదివారం పలుచోట్ల ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు.

కొత్తపేట: నేడు జరిగే పోలింగ్‌కు కొత్తపేట నియోజకవర్గానికి 47 సంబంధించి స్థానిక హైస్కూల్ గ్రౌండ్ నందు సిబ్బందికి ఇవిఎంలను పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆర్ఒ జివివి.సత్యనారాయణ దిశా నిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రానికి ఇవిఎంలతో పోలింగ్ స్టేషన్ లకు చేరుకోనున్నారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.అయితే పోలింగ్ సమయానికి ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆర్ఒ సిబ్బందికి సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలతో పాటు పోలింగ్ ప్రశాంత కరమైన వాతావరణంలో జరిగేటట్లు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉండటంతో గుమిగూడి ఉండకూడదని హెచ్చరించారు. ఓట్లరు ప్రలోభాలకు గురి కాకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. **రామచంద్రపురం:** సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని ఆర్‌డిఒ, ఎన్నికల అధికారి సుధాసాగర్ తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గం పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని, వాటి నిర్వహణకు 239 మంది బిఎల్ఒలు, ఇతర అధికారులు వారికి ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి సిద్ధంగా ఉన్నారని వివరించారు. ప్రజలు తమ ఓటుహక్కును వినియోగంచు కోవాలని, ఆయన విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు షామియానాలతో కవర్ అయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇవిఎంల భధ్రత కు మూడంచెల భధ్రత ఏర్పాటు చేశామన్నారు. 78 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు కేంద్ర బల గాలను మోహరించామన్నారు. పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ, ఎన్నికల పోలింగ్కు సంబంధించి చివరగా చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక అమలు పోలింగ్ స్టేషన్లలో బ్యారికేడ్లు, ఫర్నిచర్, లైటింగ్, తాగునీరు, వంటి వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. ఇవిఎంల తరలింపునకు రవాణా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్లు, వాటి భద్రపై పూర్తి ఏర్పాట్లు చేశామని వివరించారు. **ముమ్మిడివరం :** ప్రోలింగ్ సజావుగా జరిగేందుకు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి వి మదన్ మోహన్ రావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో భాగంగా ముమ్మిడివరం నియోజకవర్గంలో 268 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,45,296 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,22,126 మంది పురుషులు 1,23,170 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో గోగుల్లంక, మగసానితిప్ప, హోప్ ఐలాండ్ దీవులుగా ఉన్నాయి. మొత్తం 25 సెక్టార్లు ఏర్పాటు చేసి 25 మంది జోనల్ అధికారులు, 25 మంది సెక్టార్ల అధికారులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 268 పోలింగ్ స్టేషన్ కు 268మంది పిఒలు, 268 మంది ఎపిఒలు మరియు 1072 మంది ఒపిఒ లను నియమించి అదనంగా 20 శాతం పిఒలు, ఎపిఒలను (రిజర్వ్)లో సిద్ధంగా ఉంచామన్నారు. 192 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్


ముమ్మిడివరంలో ఏర్పాటుచేసిన పోలింగ్ డిస్పాచ్ కేంద్రం నుంచి సామగ్రి తీసుకువెళుతున్న ఎన్నికల సిబ్బంది

ద్వారా పోలింగ్ సరళిని లైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. 64 ఫ్లయింగ్ స్క్వాడ్లు తో సుమారు 40 కి పైగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా శాంతియుత వాతావరణంలో జరిగేందుకు పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్‌పి కరణం కుమార్ నేతత్వంలో ముగ్గురు డిఎస్‌పిలు, ఎనిమిది మంది సిఐలు, 15 మంది ఎస్ఐలు, 200 మంది పోలీస్ సిబ్బంది, రెండు బెటాలియన్లు సిఆర్ పిఎఫ్, ఒక సిఐఎస్ఎఫ్ బెటాలియన్ ద్వారా పోలింగ్ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేపట్టామని ముమ్మిడివరం సిఐ ఎన్.కొండయ్య తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ మోకా గణపతి రావు జూనియర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో ఆదివారం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేసే కార్యక్రమాన్ని పటిష్ఠమైన బందోబస్తు మధ్య చేపట్టి,వారికి కేటాయించిన రూట్ వాహనాల్లో సిబ్బందిని ఆయా కేంద్రాలకు తరలించామన్నారు. ప్రతి ఒక రూట్ కు ఒక సెక్టార్ అధికారిని నియమించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వికలాంగులు, వద్ధులు సులువుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే విధంగా ర్యాంపు మరియు వీల్ చైర్స్ ఏర్పాటు చేసే విధంగా ఆదేశించామన్నారు. **రాజానగరం:** స్థానిక ఇంజినీరింగ్ వర్కషాపు నన్నయ్య యూనివర్శిటీ, వెలుగుబందలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపినీ కార్యక్రమాన్ని నిర్వహించి ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందిని బస్సుల్లో వారి విధులు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు పంపించారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి మాట్లాడుతూ రాజానగరం అసెంబ్లీ నియోజకవ ర్గంలో 137 లోకేషన్లలో 216 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 2,16,491 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 20 రూట్ అధి కారులు 20 సెక్టార్ల అధికారులు నియమించామన్నారు. 235 మంది పిఒలు, 228 మంది ఎపిఒలు, 911 మంది ఇ తర సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలకు తావు లేకుండా వెబ్ కాస్టింగ్ పోలీస్ బందోబస్తు పక్కా ప్రణాళికతో సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా 55 మంది సూక్ష్మ పరిశీలకులు, పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని, 216 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుచేశామన్నారు. **గోపాలపురం:** ప్రతి ఓటరు స్వేచ్ఛగా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని గోపాలపురం ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి కె.ఎల్. శివజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబందిం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో (గరల్స్) గోపాలపురంలో ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో పంపించారు.ఈ సందర్భంగా గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి కె.ఎల్. శివజ్యోతి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది పిఒ, ఎపిఒ, మరియు ఇతర సిబ్బంది రేపు ఉదయం మాక్ పోల్ నిర్వహించే వరకు ఇవియంలు ఓపెన్ చేయకూడదని, పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు ను పూర్తి చేసుకోవాలని, పోలింగ్ ఏజెంట్లు తో మాట్లాడి రేపు ఉదయం 5.30 గంటలకల్లా మార్క్ పోల్ మాక్ పోల్ నిర్వహణకు పోలింగ్ ఏజెంట్లు తప్పకుండా హాజరు కావాలని తెలియజేయాలన్నారు. ఇవిఎంలకు ఎక్కువ వెలుతురు తగలకుండా కిటికీలు మూసివేయాలని, ట్యూబ్ లైట్ వేసి ఉంచాలని తెలిపారు. ఇవిఎంల్లో ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే సెక్టోరియల్ అధికారికి తెలియజేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది కి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎవ్వరు కూడా బయటకు వెళ్లరాదని భోజనం మరియు ఉదయం టి, టిఫిన్, మధ్యాహ్నం భోజనం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 149 లోకేషన్లలో 248 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 2,42,763 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 25 రూట్ అధి కారులు 25 సెక్టార్ల అధికారులు నియమించామన్నారు. 207 మంది పిఒలు, 216 మంది ఎపిఒలు, 791 మంది ఇ తర సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో వెబ్ కాస్టింగ్, పోలీస్ బందోబస్తు ప క్కా ప్రణాళికతో సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా 63 మంది సూక్ష్మ పరిశీలకులు, పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని, 248 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుచేశామన్నారు.


ఎన్నికల సిబ్బందిని తీసుకువెళ్లేందుకు సిద్ధం చేసిన బస్సులు

ఎన్నికల సిబ్బంది తరలింపునకు బస్సులు

ప్రజాశక్తి -దేవరపల్లి

గోపాలపురం నియోజవర్గంలోని పోలింగ్ స్టేషన్ వారీగా వెళ్లవలసిన పోలింగ్ సామగ్రిని ఇవిఎంలను మరియు పోలింగ్ సిబ్బందిని పోలీస్ స్టేషన్లకు తరలించడానికి గాను అధికారులు బస్సులను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద సిద్ధం చేశారు. ఈ బస్సులు పోలింగ్ సిబ్బందిని ఎన్నికల సామగ్రితో పాటు వారికి కేటాయిం చిన పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లడానికి సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

తొలిసారిగా ఓటు వేయనున్న 4,495 మంది

ప్రజాశక్తి-మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో తొలిసారిగా 4,495 మంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో 2,505 మంది పురుషులు, 1,990 మంది మహిళా ఓటర్లు ఉన్నారు నియోజకవర్గం మొత్తం ఓటర్లు లక్ష 97 వేల 731 మంది ఓటరులు ఉండగా అందులో 99,563 మంది పురుషులు 98,162 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 85 సంవత్సరాల పైబడిన వారు 875మంది కాగా 3,683 మంది వికలాంగ ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ విధుల్లో 1,060 మంది సిబ్బంది

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ నిర్వహణకు1,060 మంది సిబ్బందిని నియమించామని రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి ఆదివారం తెలిపారు. ముంగండ హైస్కూల్ వద్ద ఎన్నికల సామగ్రిని అందజేశారు. 212 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుందన్నారు. సామగ్రిని సిబ్బందిని తరలించేందుకు 124 వాహనాలు వినియోగిస్తున్నామన్నారు. 17 మంది సెక్టోరియల్ అధికారులను నియమించమన్నారు.


చెముడులంక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని పోలింగ్ కేంద్రాలను మండల ఎన్నికల అధికారి, తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్లు విజయ రేఖ, జానకి రాఘవలతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలించారు. ఆయన ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, గాలి పుష్కలంగా ఉండాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు తప్పకుండా అందుబాటులో ఉండాలన్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక అధికారులకు ఆయన ఆదేశించారు. మండలంలో గల 62 పోలింగ్ కేంద్రాలలో ఆలమూరు, పినపళ్ళ, గుమ్మిలేరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారంలో గల 31 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. వాటన్ని టిని పరిశీలించామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఈ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సందీప్ కుమార్, బిఎల్వోలు రాంపండు, భారతి, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో నేడు సెలవు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల తేదీ రోజున సోమవారం రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్థానికంగా సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లా ఖజానా, ఉప ఖజానా కార్యాలయాలు, అత్యవసర సేవల విభాగాలు మినహాయించబడతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఓటరూ పోలింగ్ కేంద్రానికి వొచ్చి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు.



పోలింగ్ సామాగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-జగ్గంపేట

నేడు జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో పోలింగ్ సామాగ్రి పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఇవిఎంలు ఇతర పోలింగ్ సామాగ్రి పంపిణీ, సిబ్బందికి భోజన ఏర్పాట్లను ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన కలెక్టర్‌కు వివరించారు. పోలింగ్ విధి నిర్వహణపై సిబ్బందికి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 1,642 పోలింగ్ స్టేషన్లలో రూ.16 లక్షల 34 వేల 122 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కోనున్నారన్నారు. జిల్లాలో 331 పొలింగ్ స్టేషన్‌లను సమస్యాత్మక పొలింగ్ బూత్‌లుగా గుర్తించినట్టు తెలిపారు. ఆ ప్రదేశాల్లో కేంద్ర ప్రత్యేక బలగాలను నియమించినట్టు చెప్పారు. వాతావరణం మారిన నేపథ్యంలో వర్షంలో ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఆర్ఒ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో ఓట్లకు నోట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అంటేనే సొమ్ముతో కూడుకున్న వ్యవహారం అని ప్రతి ఎన్నికలూ రుజువు చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికల వరకు నిధుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల సంఘం ఎన్ని ప్రకటనలు చేసిన ఓటుకు నోట్లు తీసుకోవడం నేరమని తెలిసినా వాటిని కట్టడి చేయడంలో సరైన యంత్రాంగం లేకపోవడంతో చేతులెత్తేస్తుంది. 2019 ఎన్నికల్లో ఓటుకు రూ.500 నుండి రూ.వెయ్యి ఇవ్వగా ప్రస్తుతం ఓటుకు పల్లెల్లో రూ.1500 పట్టణాల్లో రూ.వెయ్యి ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి పట్టణ ప్రాంతంలో పాటు ఉద్యోగస్తులు సైతం ఓట్లకు నోట్లను ఆశించడంతో క్రింది స్థాయి నుండి పైవరకు ధన ప్రవాహం కొనసాగుతోంది. ఇక అన్ని ప్రాంతాల్లోనూ వైసిపి నాయకులు కార్యకర్తల సాయంతో మూడు రోజులు ముందే డబ్బులు పంపిణీ పూర్తి చేశారు. తెలుగుదేశం పార్టీ సొమ్ములు పంపిణీలో విఫలమైంది ఆ పార్టీ ఆశించిన స్థాయిలో ఓట్లకు నోట్లు పంపిణీ చేయకపోవడంతో పల్లెల్లోని పలు ప్రాంతాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపించినా సొమ్ములు పంపిణీ జరగకపోవడంతో టిడిపి అభిమానుల సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓట్లకు నోట్ల ప్రభావం ఎంతవరకు పని చేస్తుందనేది సోమవారం జరిగే ఎన్నికల్లో పోలింగ్లో ఓట్లు శాతాన్ని బట్టి అంచనా వేసే వీలు ఉంది.

పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు రూరల్, నిడదవోలు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కోసం పూర్తిస్థాయిలో ఎన్నికల యంత్రాంగాన్ని సమాయత్తం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ జెడ్‌పి బాయ్స్ హైస్కూల్లో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనపర్తి నియోజకవర్గ పరిధిలో 228 పోలింగ్ కేంద్రాల్లో సుమారు రెండు వేల మంది పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సర్వైవల్ బృందాలు, పోలీసు సిబ్బంది విధుల్లో భాగస్వామ్యం అయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 228 పోలింగ్ కేంద్రాలను 101 లొకేషన్స్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 21 మంది సెక్టార్ అధికారులు, 21 రూట్‌ల ద్వారా పోలింగ్ సామాగ్రిని తరలించామన్నారు. 228 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పిఒలు 186 మంది, ఎపిఒలు 189 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 707 మందిని నియమించనున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను 63 మంది మైక్రో అబ్జర్వర్స్ నిశితంగా పరిశీలిస్తారన్నారు. వారు నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి, ఎన్నికల సాధారణ పరిశీలకులకు జవాబుదారీతనం కలిగి ఉంటారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి ఎమ్.మాధురి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో ఉన్న 228 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ తరలించే ప్రక్రియ ప్రారంభం చేశామన్నారు. ఇవిఎంలు, కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్ తరలింపునకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మావులేటి సోమరాజు హైస్కూల్లో ఆదివారం పోలింగ్ సామాగ్రి పంపిణీని సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు సంబంధించి ఇవిఎం యంత్రాలు, వివి.పాట్స్, పోలింగ్ ప్లాట్ ఫామ్ తదితర సామాగ్రి అందిస్తున్నామన్నామని తెలిపారు. ఆ మేరకు సామాగ్రికి చెందిన చెక్ లిస్ట్ కూడా ఇస్తున్నామన్నారు. చెక్ లిస్ట్‌లో తెలిపినవన్నీ వాటిలో ఉన్నాయో, లేదో అని పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా సరి చూసుకోవాలన్నారు. సామాగ్రి తీసుకున్న అనంతరం పోలింగ్ సిబ్బంది పిఒ, ఎపిఒ ఇతర పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన బస్సుల్లో పోలింగ్ స్టేషన్‌కు వెళ్లాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో రాత్రికి బస చేసి, 13వ తేదీ సోమవారం ఉదయం 5.30 గంటలకు ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం ఉదయం 7 గంటలకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రారంభించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 101 లోకేషన్లలో 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 1,84,136 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 89,743 మంది, మహిళలు 94,388 మంది, ట్రాన్స్ జెండర్స్ ఐదుగురు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ రోజున ఎటువంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా మైక్రో అబ్జర్వర్లు, పోలీసు భద్రతా సిబ్బందిని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నియమించినట్టు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా వేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసామని నిడదవోలు ఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.వెంకట రమణ నాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక ఉమెన్స్ కాలేజీ ఆవరణలో పోలింగ్ సామగ్రి పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 205 పోలింగ్ స్టేషన్లలో 41 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. నియోజక వర్గ పరిధిలో 2,13,396 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 1,04,235 మంది పురుషులు, 1,09,157 మహిళా ఓటర్లు, నలుగురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారన్నారు.



రాజమహేంద్రవరంలో మెటీరియల్ పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత



కొవ్వూరులో మెటీరియల్ పంపిణీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్




నిడదవోలులో పరిశీలిస్తున్న ఆర్ఒ

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల దళితులు నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉందని కోనసీమ రైతు పరిరక్షణ సమన్వయ సమితి కోనసీమ విభాగం అధ్యక్షులు కె.సత్తిబాబు అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పట్ల రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని కోనసీమ రైతు పరిరక్షణ సమన్వయ సమితి కో కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం అమలాపురంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 9/77 యాక్టు అమలులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పేద దళిత వర్గాలకు చెందిన బంజర భూములు లంక భూములు సొసైటీ భూములు తిరిగి పెత్తందారులు స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు హక్కులు కాపాడుకోవడం కోసం పోరాటమే శరణ్యమని రైతులు మేధావులు న్యాయవాదులు ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులు భూములు కోల్పోయే ప్రమాదం ఉందని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడితేనే చట్టాన్ని రద్దు చేయడం లేదా మార్పు చేయడం చేస్తారన్నారు. భూ చట్టాలు, భూ సంస్కరణ చట్టాలు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పరిధిలోకి రాకుండా కేంద్ర ప్రభుత్వం ఈ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టంతో భూ కబ్జాదారులకు పేద దళిత భూములను దోచిపెట్టే విధంగా ఉందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై పునరాలోచన చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏ చట్టం తీసుకువచ్చినా దాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేయడం దారుణమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రాష్ట్రంలో అమలు చేయడానికి సిఎం జగన్ ప్రయత్నం చేయడం దారుణమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు, వెంకటేశ్వరరావు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలీస్ అదికారులు, సిబ్బందికి విధులపై ఎస్‌పి ఎస్.శ్రీధర్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రమంతా సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువమంది గుమిగూడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓటర్ల సెల్ ఫోన్‌లను పోలింగ్ బూత్ లోపలికి అనుమతించబోరన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చేవారు తప్ప ఇతరులు ఎవరూ ఉండకూడదని, వాహనాలు కూడా రావడానికి అనుమతి లేదని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి వెళ్ళి ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించడానికి అనుమతి ఉంటుందన్నారు. అప్రమత్తంగా ఓటర్లతో పాటు వృద్ధులు, బాలింతలకూ, వికలాంగులకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిబ్బంది తోడ్పడాలని తెలిపారు.



కాయ్ రాజా కాయ్

ఎన్నికల ఫలితాలపై భారీగా బెట్టింగులు
కీలక నేతలు పోటీ చేసేచోట రూ. కోట్లలో పందేలు

ప్రజాశక్తి- రాజోలు



రాష్ట్రంలో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయి? అధికారంలోకి వచ్చేదెవరు? ఉత్కంఠ రేకెత్తిస్తోన్న ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. కొన్ని చోట్ల కోసు పందేలకు సైతం వెనుకాడని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసే పార్టీపై 1:5 చొప్పున అంటే రూ.లక్షకు రూ.5 లక్షలు, పులివెందులలో జగన్, కుప్పంలో చంద్రబాబు సాధించే మెజారిటీపై 1:2, కూటమి, వైసిపి సీట్లపై 1.1 చొప్పున రూ.కోట్లలో పందేలు సాగుతున్నాయని అమలాపురానికి కు చెందిన వ్యాపారి తెలిపారు. అలాగే పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ గెలుపు, రాజమహేంద్రవరంలో పురంధేశ్వరి గెలుపుపై కోసుల్లో పందేలు సాగుతున్నాయి. కోడిపందేలకు వాసికెక్కిన ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రూ.లక్షకు రూ. లక్షన్నర, రూ. లక్షకు రూ.5 లక్షలు కాయ్ రాజా కాయ్ అంటున్నారు. చోటా నేతలు, కొందరు వ్యాపారులు మధ్యవర్తుల అవతారమెత్తారు. ఎవరు గెలిచినా తమకు 1 నుంచి 5 శాతం కమీషన్ ఇవ్వాలని మాట్లాడుకుంటున్నారు. సినీ, రాజకీయ, వ్యాపార రంగాల వారితోపాటు ప్రైవేటు ఉద్యోగులు,యువకులు, చిరువ్యాపారులు రూ.50 వేల నుంచి రూ.కోటి వరకు పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంపైనే ఎక్కువ పందేలు జరుగుతున్నాయి.

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సష్టించిన నేతలు, ప్రజాదరణ భారీగా ఉన్న నాయకులు, నిత్యం వివాదాలతో చర్చనీయాంశమైన ప్రజాప్రతినిధులు బరిలో ఉన్నచోట భారీగా పందేలు సాగుతున్నాయి. రాష్ట్రంలో జోరుగాపందేలు సాగుతున్న టాప్ 10 అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాలో పిఠాపురం, మంగళగిరి, గన్నవరం, గుడివాడ,ఉండి, కాకినాడ సిటీ, రాజోలు, విజయవాడ తూర్పు, నగరి, ధర్మవరం ఉన్నాయి.

ఈ సెగ్మెంట్లపైనా జోరుగా బెట్టింగులు..!

రాజోలులో మళ్లీ జనసేన గెలుస్తుందని,గతం కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని సుమారు 20 కోట్లు పందెం జరిగింది. ఉమ్మడి జిల్లాలలో ఎక్కువ స్థానాలు కూటమే గెలుస్తుందని 100 కోట్లు పైగా పందెం జరిగిందని అంచనా. పిఠాపురంలో పవన్ కల్యాణ్ 50 వేలకు పైగా మెజారిటీ సాధిస్తారని కాకినాడకు చెందిన ఒక వ్యాపారి రూ.2.5కోట్లు దళారి వద్ద ఉంచినట్టు తెలుస్తోంది. ఉండి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి రఘురామకష్ణరాజు విజయంపై 1:2 లెక్కన పందేలుసాగుతున్నాయి.

కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్ మెజారిటీపై బెట్టింగులు పంటర్లకు కాసులు కురిపించనున్నాయి. కుప్పంలో చంద్రబాబు మెజారిటీ తగ్గుతుందని ఒకరు పందెం పెడితే కాదు గతంకంటే పెరుగుతుందని మరికొందరు బెట్టింగ్ వేస్తున్నారు. పులివెందులలో జగన్ రికార్డు మెజారిటీలపై 1:3 చొప్పున పందేలు సాగుతున్నాయి.

వెనక్కి తగ్గుతున్న వైకాపా మద్దతుదారులు!

మూడ్రోజుల వ్యవధిలోనే వాతావరణం తారుమారైంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలవకపోతే పొలాలు రాసిస్తామంటూ సవాల్ విసిరిన వైకాపా నేతలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. ఇప్పటికే మధ్యవర్తుల వద్ద డబ్బు ఉంచినవారు.. కమీషన్ తీసుకొని తిరిగి సొమ్ము ఇవ్వమని కాళ్లబేరానికి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో వైకాపా అభ్యర్థి తరపున తొలుత మొగ్గు చూపిన నేతలు ప్రస్తుతం చప్పుడు చేయడం లేదు. కాకినాడలో వైకాపా అభ్యర్థి మెజారిటీపై తొలుత రూ.25 లక్షలు పందెం అంటూ వచ్చిన ఒక వ్యాపారి ప్రస్తుతం రూ.5 లక్షలతో సరిపెట్టారు.

ఓటింగ్‌కు వేళాయే...

ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. నేడు పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఆదివారం సాయంత్రానికే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో సహా చేరుకున్నారు. ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బంది హడావుడి కనిపించింది. ఆయా కేంద్రాల నుంచి సామగ్రిని తీసుకుని పోలింగ్ సిబ్బంది కేటాయించిన కేంద్రాలు వెళ్లిపోయారు. సోమవారం జరిగే పోలింగ్ నిర్వహణకు సిద్ధమయ్యారు.


చాగల్లులో సర్వాంగసుందరంగా పోలింగ్ కేంద్రం


బూత్‌లకు పయనం


నన్నయ యూనివర్శిటీలో పంపిణీ కేంద్రం






వెబ్ కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత


కొత్తపేటలో వర్షపు నీటిలో సిబ్బంది ఇబ్బందులు

ఓటు వేసేద్దాం.. ఇలా...




ప్రచార పర్వం ముగిసింది. ప్రలోభాలకు తెర పడింది. ఇక ఓటర్ల వంతు వచ్చింది. పోలింగ్‌కు సమయం సమీపించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రంగం సిద్ధమైంది. ఓటర్లు కూడా ఓటు వేసేందుకు రెడీగా ఉన్నారు. అయితే నేటికీ కొంత మంది ఓటర్లకు ఓటు ఎలా వేయాలి? అనేదానిపై పలు సందేహాలున్నాయి. వాటిని నివృత్తి చేసే ప్రయత్నమే ఇది.. ఓటు వేసేందుకు వెళ్లే ముందు ఇలా ఒక లుక్కేయ్యండి మరి..

:: ప్రజాశక్తి - పిఠాపురం ::

గుర్తింపుకార్డు, ఓటరు స్లిప్పు తీసుకున్నారు కదా.. లైన్లో నిలుచొని అధికారులకు సహకరించండి.

లోపలికి వచ్చేశారా.. ముందు ఒక అధికారి ఓటరు జాబితాలో పేరు, ఐడి ప్రూఫ్‌ను తనిఖీ చేస్తాడు.


ఆ తర్వాత ఇంకో అధికారి వేలిపై సిరాగుర్తు పెట్టి చిట్టీ ఇస్తారు.



ఆ తర్వాత మూడో అధికారి మీ చిట్టీ తీసుకుని వేలును పరీక్షిస్తాడు

ఆ తర్వాత అక్కడ ఒక బాక్సులో ఉన్న ఇవిఎం దగ్గరకు వెళ్లండి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఇవిఎం)పై మీకు నచ్చిన అభ్యర్థి ఎదురుగా ఉన్న మీట నొక్కండి. మీకు ఒక బీప్ ధ్వని వస్తుంది. వివిపిఎటి ముద్రిత స్లిప్పను తనిఖీ చేయండి.

ఇవిఎం, వివిపిఎటిని ఉపయోగించి ఓటు వేయడం ఇలా...



మీకు బీప్ శబ్దం వినిపించకపోయినా, బాలట్ స్లిప్ కనిపించకపోయినా వెంటనే ప్రిసైడింగ్ అధికారిని సంప్రదించాలి

ఓటరు గుర్తింపు కార్డు లేదా ప్రత్యామ్నాయ పత్రాలివిగో...

ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి ఓటర్ గుర్తింపు కార్డు పోగొట్టుకున్నా, కార్డు లేకున్నా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫొటో డాక్యుమెంటులో ఏదో ఒకదాన్ని చూపించి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంది. ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులేని ఓటర్లు ఎన్నికల కమిషన్ సూచించిన గుర్తింపు పత్రాలు పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు సర్వీస్ ఐడెంటి కార్డు, ఫొటోతో ఉన్న బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ పాస్ పుస్తకం, పాన్ కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ జారీచేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంటు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు జారీచేసిన అధికార గుర్తింపుకార్డులు, ఆధార్ కార్డును చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.



ఈ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రరం

ఎన్నికల సమయం. ఓటు హక్కు ఉన్నవాళ్లంతా ఓట్లు వేసేందుకు పోలింగ్ రోజు బూత్‌లకు క్యూకడుతుంటారు. అంతా ఒకటే హడావుడి.. రకరకాల జనం ఓటు కోసం వస్తుంటారు. ఓటు వేయడానికి ఎన్నికల సంఘం పలు నిబంధనలు రూపొందించింది. ఓటు వేసే సమయంలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను పాటించాల్సిందే. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఓటరు కాకపోతే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశం ఉండదు. పోలింగ్ బూత్ సమీపంలో 144 సెక్షన్ అమలు చేస్తారు. ఎవరైనా గుంపులు గుంపులుగా వెళ్లినా.. న్యాసెన్స్ క్రియుట్ చేసినా వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. పోలింగ్ బూత్ సమీపంలో ఎలాంటి ప్రచారం చేయకూడదు. ఓటరు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని ఓటు వేయడానికి వెళ్లాల్సి ఉంటుంది. వేరే వాళ్ల ఓటు మరొకరు వేయడానికి ప్రయత్నించినా వెంటనే పోలీసులు అరెస్ట్ చేస్తారు. పోలింగ్ బూత్‌లోకి ఎలాంటి మొబైల్ ఫోన్లు, కెమెరా తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారుల విధులకు ఓటరు ఆటంకం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. మద్యం తాగి ఓటు వేయడానికి వెళ్లినా.. పోలింగ్ బూత్‌లో ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు. మద్యం తాగి పోలింగ్ బూత్ సమీపంలో న్యూసెన్స్ క్రియేట్ చేసినా చర్యలు తీసుకుంటారు.

ఓటరు ఇలా చేస్తే నేరం..

ఓటు వేయడానికి వెళ్లినప్పుడు మొబైల్ ఫోన్ పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లినా.. స్విచ్ఛాఫ్ చేసి ప్రిసైడింగ్ ఆఫీసర్ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఓటు వేసేటప్పుడు మొబైల్‌లో లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాల్లో షఉట్ చేయకూడదు. ఓటును బహిరంగపర్చడం చట్టరీత్యా నేరం కావడంతో ఓటరు తాను ఓటు వేసేటప్పుడు.. దేనికి వేశారనే విషయాన్ని బహిరంగ పర్చేలా ఏపనిచేసినా నేరమే అవుతుంది. ఎవరైనా ఓటరు ఓటు వేసేటప్పుడు దానిని ఫొటో లేదా వీడియో తీస్తే ఆ ఓటరును పోలీసులు అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు.



ఓటరు ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత వెంటనే పోలింగ్ బూత్‌ను వదిలి బయటకు వచ్చేయాలి. ఉద్దేశపూర్వకంగా ఎక్కువ సేపు అక్కడే నిల్చుని.. ఇతరులు ఓటు వేయకుండా ఆటంకం కలిగించినా చర్యలు తీసుకుంటారు. ఓటుకు నోటు తీసుకోవడం నేరం. ఎవరైనా డబ్బులు తీసుకుని ఓటు వేశారని రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటారు.

మండలంలో ఎన్నికల సంక్రాంతి!

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సార్వత్రిక ఎన్నికలవేళ మండలానికి సంక్రాంతి పండుగ కళొచ్చింది. జనవరి నెలలో వచ్చే సంక్రాంతి, ఇప్పుడు మే నెలలో మరో సంక్రాంతి వచ్చినట్లు ఉందని పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం రాష్ట్రం విడిచి హైదరాబాద్, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో ఉండేవారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సొంతూళ్ల బాటపట్టారు. ఐటీ ఉద్యోగులకు శని, ఆదివారాలు, సెలవుతోపాటు ఓటింగ్ రోజు ప్రత్యేక సెలవు కావడంతో మూడు రోజులు కలిసి వచ్చింది. దీంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు హుషారుగా పల్లెబాట పట్టారు.


ఓటేసేందుకు సొంతకారులో పిన్నితో కలిసి పాలంగి వచ్చిన శ్రీకర ప్రసాద్

దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. సందట్లో సడేమియా అన్నట్లు ఇదే అదునుగా ప్రైవేటు బస్సు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ల ధరలను పెంచేశారు. అయినప్పటికీ జిల్లా ఓటర్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఆశయంతో కష్టమైనా గాని ఇష్టంగా ఇళ్లకు చేరుకున్నారు. రైలులో జనరల్ టిక్కెట్లు తీసుకున్న వారు సైతం హైదరాబాద్ నుండి రిజర్వేషన్ భోగిలలో నిలబడి వచ్చినట్లు పలువురు చెబుతున్నారు.

ఓటు వేసేందుకే వచ్చా...

మాది పాలంగి. ఓటు హక్కును వినియోగించుకోవాలని హైదరాబాద్ నుంచి వచ్చాను. రైలుకు రిజర్వేషన్ దొరకలేదు. బస్సు టిక్కెట్ రేట్లు పెంచేశారు. దీంతో ఎలాగైనా ఓటు వేయాలనే ఉద్దేశంతో సొంత కారులో వచ్చాను.

- పి. శ్రీకర ప్రసాద్, సాఫ్ట్ వేర్ ఉద్యోగి, హైదరాబాద్